# కథ

# బలవంతుడ నాకేమని....!

**కొంపెల్ల కామేశ్వరరావు**

డ్యూటీ ముగించుకుని ఇంటికి చేరుకునే సరికి సాయంత్రం ఏడు గంటలయ్యింది. ఇల్లంటే మరీ పెద్దదేం కాదు, జనక్ పురిలోని ఓ బ్లాకులో రెండో అంతస్తులో ఒకగది, దాన్నానుకొని బైటవైపు కుడిచేతిపక్క చిన్న వంటగది, ముందువైపు వరండా. ఇదీ దాని నైసర్గిక స్వరూపం. కింద రెండు పోర్షన్లలోను మళయాళ కుటుంబాలే అద్దెకుంటున్నాయి. స్నానంచేసి కాస్త విశ్రాంతిగా కూర్చున్నాను. మంచివేడివేడి టీ తెచ్చి ఇచ్చి పిల్లల అల్లరి పనులు, దశలవారీగా వస్తున్న మార్పుల గురించి చెబుతూ సంతోషిస్తోంది శ్రీమతి.

ఉన్నట్టుండి ఒక్కసారిగా ఏడుపులు, హాహా కారాలు వినిపించాయి. నేలపై అడుగులు బలంగా పడుతున్న ధ్వని రెండో అంతస్తు వరకు వినిపిస్తోంది. చెవులు రిక్కించి వింటూ ఎక్కణ్ణుంచి వస్తున్నాయో అంచనా వేస్తున్నాను. ఫస్ట్‌ఫ్లోర్ నుంచే.

“అవునండీ, ఫస్ట్‌ఫ్లోర్ నుంచే”, అంది శ్రీమతి.

“ఉండు నాన్నా”, అంటూ ఒళ్ళోకూర్చున్న రెండో వాణ్ణి నేలపై కూర్చోబెట్టి కిందకి వెళ్ళాను.

గది తలుపులు మూసేసి ఉన్నాయి. లోపల భార్యను కొడుతున్న భర్త. పాపం ఆ ఇల్లాలు పెట్టే ఘోష. తప్పించుకునే వీలులేకుండా తలుపులు బిగించేశాడు. ఉన్న ఒక్కగదిలో నూ ఆమూలకీ ఈ మూలకీ పరుగులు పెడుతోంది. పరుగులు పెడుతున్న కొద్దీ రెచ్చిపోయి బాదేస్తున్నాడు. బలవంతంగా తలుపులు తెరచుకొని ఏడుస్తూ బైటకి వస్తోందామె. వెనకనే అతనూ వస్తూ లోపలికి లాక్కెళ్తున్నాడు.

“క్యా హువా భాయ్ సాబ్, ఐసా క్యోం పీట్ రహేహో? ఛోడ్ దో ఇస్ బేచారేకో” అన్నాను.

మాట విననట్టుగా, విచక్షణా రహితంగా ఆమెని కొడుతూనే ఉన్నాడు.

ఈ బీభత్సం వినబడింది కాబోలు, కింద పోర్షన్లోని ఇల్లాలు జ్యోతి పైకి వచ్చారు. “బహెన్ జీ, ఇస్ కో రోకో, వర్నా బేచారీ, మర్ జాయేగి” అంటూ బతిమాలాను. ఆమె అడ్డుకోబోతే, చేతిని విసిరికొట్టి మళయాళంలో ఏదో చెప్పాడు.

“యే ఆపస్ కా మామ్ లా హై, బీచ్ మేం కోయీ నహీం ఆనా” అంటున్నాడన్నారు.

“ఈ మధ్యే పెళ్ళైందండీ, ఇద్దరూ అన్యోన్యంగా ఉండాల్సింది పోయి ఇలా చేస్తున్నాడేంటో” అంటూ విచారం వెలిబుచ్చింది శ్రీమతి.

“అతనేంచేస్తుంటాడు” అడిగానామెని హిందీలో.

“ఇక్కడే ఏదో స్కూల్లో స్కేటింగ్ మాస్టర్‌గా చేస్తున్నాడు, ఇంట్లో స్కేట్స్, హాకీ స్టిక్స్, డంబుల్స్ ఉన్నాయి. వాటితో కొడుతున్నాడ”న్నారు. ఆమె కూడా దగ్గర్లోని హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తోంది అని వివరించారు. ఇలా అంటూండగానే ఆమె మళ్ళీ తలుపులు తెరుచుకొని బైటకి వచ్చింది. వస్తూనే వంటగదికి, కాంపౌండ్‌వాల్‌కీ మధ్య సొమ్మసిల్లి పడిపోయింది. ఆయాసంతో రొప్పుతోంది. జుట్టు పళ్ళ మధ్య ఇరుక్కుపోయింది. కళ్ళు తేలేసింది. చాలా బీభత్సంగా ఉంది దృశ్యం. ఇది గమనించాడేమో, కాసేపు మౌనంగా ఉండిపోయాడు. ఆమెకు దగ్గరగా వెళ్ళి ముఖం మీద నీళ్ళు చల్లి తేరుకున్నాక మంచినీళ్ళు తాగించింది మా శ్రీమతి.

“అసలేం జరిగిందమ్మా” తల నిమురుతూ ప్రేమగా అడిగారు జ్యోతి.

ఆమె ఏదో చెప్పబోతుండగా, “లోపలికి రా” అంటూ గద్దించాడు. ఆ అరుపుకి అందరం అదిరిపడ్డాం.

“ఎందుకీ రాత్రివేళ ఇంత గొడవ చేస్తున్నావ”ని ధైర్యంచేసి అడిగాను.

“యహ్ హమారా ఘరేలూ మామ్లా హై” అంటూ కటువుగా సమాధానం ఇచ్చి “వస్తున్నావా లేదా” అంటూ అసహనంగా అరిచాడు.

భయపడుతూనే లోపలికి వెళ్ళింది. తలుపులు వేసి మళ్ళీ చిత్రహింస ప్రారంభించాడు. ఇక ఈ సారి తప్పించుకొని మెట్లెక్కి వచ్చి “భాయ్ సాబ్, ముఝే సౌ రుపయే దీజియే, మాం, బాప్ అమెరికా మేం రహ్ తేహైం. ఇన్ కో ఫోన్ కరూంగీ. లగ్తాహై ఆజ్ ముఝే మార్‌డాలేగా” అంది ఏడుస్తూ. వెంటనే తీసి ఇచ్చాను.

“ఇదిగో, బైటకి వెళ్ళావా, నువ్వు మళ్ళీ ఇంట్లోకి రావక్కర్లేదు” అంటూ అరుస్తూ ఆమె వేనిటీ బేగ్‌ను బయటకు విసిరేశాడు.

“అసలేమైందమ్మా” అనునయంగా అడిగాను.

"భాయ్ సాబ్, ఈ మధ్య ఆయన ఓ పదిరోజులపాటు కేరళ వెళ్ళారు. వెళ్ళేముందు నా ఖర్చులనిమిత్తం నాలుగు వందల రూపాయలిచ్చి అంతకు మించి ఖర్చు పెట్టద్దన్నారు. పెళ్ళైన కొత్తకదా, సరదాగా చెప్పారేమో అనుకున్నా. అవసరాలన్నింటినీ ముందే ఊహించలేం కదా భాయ్ సాబ్. అనుకోకుండా వచ్చిన అవాంతరాన్ని ఎదుర్కోడానికి కొంత డబ్బు ఎక్కువ ఖర్చైంది. పైగా, పదిరోజులకి నాలుగువందలేం సరిపోతాయ్ భాయ్ సాబ్, అదికూడా నా జీతంలోంచే ఖర్చు పెట్టుకున్నాను. అయినా ఇలా...." అంటూ ఏడుస్తూ, వెక్కుతూ, ఒగరుస్తూ వచ్చీరాని హిందీలో, ఇంగ్లీషు, మళయాళం కలగలిపి చెప్పింది. ఆమెతో పాటే పైకి వచ్చిన జ్యోతిగారితో సహా అందరం ఆశ్చర్యపోయాం.

"అతనికి తెలీకుండా ఎందుకు ఖర్చు పెట్టావమ్మా?" అడిగాను.

ముందు చెప్పడానికి సందేహించింది. కాసేపాగి "పైకి చెప్పుకోలేని ఖర్చులు మాకు కూడా ఉంటాయ్ కదా భాయ్ సాబ్. పైగా నేను డ్యూటీకి వెళ్ళి వస్తూండాలి కదా?" అంది. పాపం ఆడపిల్ల, ఇక అంతకంటే ఏం చెబుతుంది?

"నిజమా, కేవలం కాస్త డబ్బు ఖర్చెక్కువైనందుకే ఇన్ని చిత్రహింసలా. ఇంత ఘోరమా?" ఆలోచనలో పడ్డాను.

రాత్రివేళ ఇంత బీభత్సం జరుగుతూంటే, చుట్టుపక్కల జనానికేం పట్టనట్టుందే, ఎవరూ వలకరించడానికి కూడా రాలేదు అనుకుంటుండగానే ఇద్దరు పోలీసులొచ్చారు. ఇది మరింత ఆశ్చర్యం కలిగించింది. ఎవరు కబురుచేశారో ఏమో. అతని వంట్లో సన్నగా ఒణుకు ప్రారంభమైంది. లోపలికి పిలిచి నర్దుబాటు చేసుకునే ప్రయత్నం మొదలుపెట్టాడు. ఇద్దర్నీ కూర్చోబెట్టి ఏం చెప్పారో ఏమో అంతా పావుగంట, ఇరవై నిమిషాల్లో సద్దుమణిగింది. బైటకు వచ్చి మళ్ళీ ఇలాంటివి జరక్కుండా వార్నింగిచ్చామని, భార్యాభర్తల మధ్య ఇంతకంటే ఎక్కువ జోక్యం వీలుపడదని చెప్పారు.

"భాయ్ సాబ్, చాలా వింతగా ఉంది. కొన్ని గంటలపాటు తన గదిని ఓ క్రీడామైదానంగా మార్చి ఆమెని ఓ ఫుట్ బాల్ లాగా ఆడుకొని నానా బీభత్సం చేసిన మనిషిని కేవలం హెచ్చరించి వదిలేశారు. ఆమె కూడా కిక్కురుమనడంలేదు. అంతలోనే జరిగిందంతా ఎలా మర్చిపోయిందంటారు?" లోగొంతుకలో నాతో అన్నారు జ్యోతిగారు హిందీలో. అయినా పోలీసులకి వినిపించనే వినిపించింది.

"మరేంచెయ్యాలంటారు? జీతం తెచ్చుకుంటోంది కదా అని ఇష్టం వచ్చినట్టు ఖర్చు పెట్టుకోడానికి ఏ మొగుడు అనుమతిస్తాడు? అయినా ఇది మొదటిసారే కదా? మరోసారిలా జరగదులెండి. కాపురం నిలబెట్టాలి కాని విడగొట్టలేంకదా? అన్నారు పోలీసుల్లో ఒకాయన.

"మరామెకి న్యాయంజరిగేదెలా?" అడిగింది శ్రీమతి. పోలీసులనుంచి జవాబు లేదు.

"మీకు తెలీని విషయం ఒకటుంది. బహుశా ఆమెకి కూడా తెలిసి ఉండదు." ఇక ఉండబట్టలేక అన్నాను. ప్రశ్నార్థకంగా చూశారు పోలీసులు.

పోలీసులతో పాటు పైకి వచ్చిన చుట్టుపక్కల వాళ్ళు కూడా ఏంచెబుతానో అని ఆసక్తిగా చూశారు.

"అతనికి అమ్మాయిలతో తిరిగే అలవాటుంది. ఇదివరకు ఒకట్రెండు సార్లు తన గదికి రప్పించుకున్నాడు కూడాను. వాళ్ళపై మోజుతో ఈమెని ఇలా బాధపెడుతున్నాడేమో, వదిలించుకునే పథకంలో భాగంగా ఇవాళ ఈ దారుణానికి ఒడిగట్టాడేమో? ఆ విషయం అతను చెప్పాడు కదా? మీరివాళ ఏదో సర్ది చెప్పేసి వెళ్ళిపోతారు. రేపెప్పుడైనా భార్య ఎదుటే వాళ్ళతో ఉంటే ఆమె గతేంకావాలి?" అన్నాను, సమయానికి గుర్తొచ్చి.

"జను సార్, నేను కింది వాటాలోనే ఉంటాను కదా ఒకరోజు తలుపు కొడితే తీశాను. బిలబిలమంటూ లోపలికి వచ్చి మెట్లెక్కి వెళ్ళారు. ఎందుకా అని పైకి చూస్తే అతని గదికే వెళ్ళారు. కుటుంబాల మధ్యకి ఇలా రావడం, రప్పించుకోవడం మంచిదికాదని హెచ్చరించాను. అయినా వినలేదు. అందుకే ఇందాక గొడవలో నేనడ్డుపడితే నా చెయ్యి విసిరిగొట్టాడు" అన్నారు జ్యోతిగారు.

"ఆ వచ్చినవాళ్ళు అతని అక్కచెల్లెళ్ళో, బంధువులో అయ్యుండొచ్చు కదా, ఇంటికొచ్చే వాళ్ళందర్నీ అనుమానిస్తే ఎలా?" అడిగాడొకాయన.

"ఆ విషయం అతను చెప్పాలికదా? నేనడక్క ముందే పరిచయం చేస్తే అనుమానించడమెందుకు? అయినా అన్నాచెల్లెళ్ళు, అక్కాతమ్ముళ్ళు తలుపులు వేసుకొని మాట్లాడుకోరుగా?" అన్నారు జ్యోతి.

ఇదంతా ఎప్పుడు విందో ఏమో, అతని భార్య, చౌక్కా ఫిల్టు పట్టుకొని భర్తని గబగబా అందరి మధ్యకి ఈడ్చుకొచ్చి ఆ చెంపా, ఈ చెంపా, ఎడాపెడా వాయించేసింది. అందులోనూ గొడవ ముగిసి అరగంట కావొస్తోందేమో కాస్త ఓపిక వచ్చినట్టుంది, ఆవేశంతో భద్రకాళిలా ఊగిపోతోంది.

"బహెన్ జీ, అందర్ సే హాకీ స్టిక్స్ లావూం ?" ఎవరిదో అక్కసుగా ఉంది గొంతు.

"ఇవ్వటిదాకా కాన్త డబ్బెక్కువ ఖర్చైనందుకే దాడి చేశావనుకున్నాను. అసలు కారణం నన్ను వదిలించుకోవడానికేనని ఇప్పుడర్థ మవుతోంది. నీకు నా అవసరం తీరి పోయిందన్నమాట. ఆ అవకాశం ఇవ్వను నీకు. మరోసారిలా జరక్కుండా ఉండేందుకే నీకీ శాస్తి." అంటూ హెచ్చరించింది.

పోలీసులతో సహా అందరం ఒక్కసారిగా మ్రాన్పడిపోయాం. నోటమాట లేదు.

"అబ్ యహ్ ఆద్మీ ఖుద్ ఠీక్ హో జాయేగా. దుబారా ఇస్ ఘర్ కో ఆనే కీ నౌబత్ నహీం ఆయేగీ" అనుకుంటూ పోలీసులు నిష్క్రమించారు. తేరుకోవడానికి మాకందరికీ చాలా టైం పట్టింది.


చదవండి! చదివించండి! చందాదారులు కండి!

చినుకు మాసపత్రిక

| | | | |
|---|---|---|---|
| సంవత్సర చందా (వ్యక్తులకు) | : | రూ. | 120/- |
| సంవత్సర చందా (సంస్థలకు) | : | రూ. | 150/- |
| 3 సంవత్సరాల చందా (వ్యక్తులకు) | : | రూ. | 330/- |
| 3 సంవత్సర చందా (సంస్థలకు) | : | రూ. | 420/- |
| 5 సంవత్సరాల చందా | : | రూ. | 500/- |
| 10 సంవత్సరాల చందా | : | రూ. | 1,000/- |
| విశిష్ట సభ్యత్వం | : | రూ. | 3,000/- |
| U.S.A | : | | 25$ |